# కరదీపిక. కె.కె.రఘునందన

"అయ్యా! నాకు రేపు సెలవిప్పించాల!" చేతులు కట్టుకుని వినయంగా అడిగాడు చెంచయ్య.

కుషన్ ఛైర్‌లో కూర్చున్న విశ్వతేజ గది బయట నిల్చున్న వాడివైపు చిరచిరలాడుతూ చూశాడు.

"ఎందుకురా మాటిమాటికీ ఎగ్గొట్టాలని చూస్తావు? నువ్వెళ్లిపోతే ఎట్లా? ఇదే అలావాటైతే నువ్వు కొండెక్కి కూర్చుంటావు. అసలే మొక్కలు మంచి ఎదుగుదలకు వచ్చే సమయం!" అన్నాడు.

విశ్వతేజకు పలురకాల వ్యాపారాలు. వాటిలో ప్రధాన భాగం తోటల పెంపకం. మామిడి మొక్కలైతే వాతావరణం దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి ఉంది. అందుకనే వాటిని అమ్మేసి మరోచోట ఖాళీ జాగా కొని, ఇటీవల అందరూ మోజు చూపిస్తున్న 'మాంజియం' మొక్కలను నాటాడు. ఆరేళ్లు శ్రద్ధగా పెంచితే కోతకు



వస్తాయి. వాటి కలప టేకును మరిపిస్తుంది. రెండెకరాల్లో వద్నాలుగు వందల మొక్కలు.

వాటిని చూసుకోవటానికి చెంచయ్యను బెత్తాయించాడు. అయితే వాడికీమధ్యనే పెళ్లయింది. తోటకాపలా వల్ల ఎన్నోరోజులు ఎటూ వెళ్లలేకపోతున్నాడు.

వాడు వెళ్లిపోతే తన తోట దెబ్బతింటుందని తేజ బాధ. బిజినెస్‌పరంగా యోచిస్తే జరిగే నష్టం గుండెలు బాదుకునేలా చేస్తుంది. అతినికి ఎప్పుడూ ఇదే దృష్టి.

"నీ క్కాడా చెబుతుంటే ... సెలవు ఇవ్వనుగాక ఇవ్వను. మొక్కలమీద మనసు పెట్టు!" పొమ్మన్నట్టు చెప్పగానే చెంచయ్య కదిలాడు ఈసురోమంటూ.

"ఏం డియర్! వాడినట్లా అప్‌సెట్ చేశావు?" వెనుకనుండి వచ్చి మెడమీద చేతులు వేసి గోముగా అన్నది భార్యామణి చందన.

"అబ్బ ... చందూ! వాడి నస తగ్గిందని సంతోషిస్తే నువ్వు తగులుకున్నావేమిటి? లేమ్మా ....! బుజ్జీ! బోలెడు వర్కుండిపోయింది. అసలే గుమాస్తా సెలవు. పెండిగ్ అయితే భరించటం కష్టం!" చేతులను విడిపించుకున్నాడు విశ్వతేజ.

పసుపుపచ్చని ఛాయతో ఎక్కడికక్కడ అమరిన ఎత్తుపల్లాలతో, పంచభక్ష్య పరమాన్నంతో వడ్డించిన నిండు విస్తరిలా కంటికింపుగా ఉంటుంది చందన.

ఒక పిల్లాడి తరువాత డాక్టర్ సలహాపై పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ జరిగింది. కానీ కోరికలు కొరివిదెయ్యాల్లా ఆమెను వెంటాడటం మానలేదు.

అయితే భర్త సాధారణంగా ఇంటి పట్టునుండడు. ఉన్నా పట్టించుకోడు. రాత్రి కూడా ఏదో సమయాన వచ్చి, ఓవైపు తిరిగి పడుకుంటాడు. స్పందన లేని రాతి బొమ్మలా.

ఈ వైఖరిలో నడుస్తోంది వారి దాంపత్య నావ.

000

"అయ్యగోరూ! మొక్కలన్నిటికీ నీరొద్దేసినాను. ఈ రేతిరికి నాను మా వూరెల్లాల ... మా అయ్యమ్మకు నులుపునేట్ట ... నే నెల్లకుంటేగాని ఈల్లేదు!" చెంచయ్య భయపడుతూనే అడిగాడు.

"ఓరే! నీ కుంటి సాకులు నా దగ్గర చెప్పకు! నువ్వెందుకు పోతున్నావో నాకు తెలుసు. నువ్వెళ్లాక ఈ రాత్రికి పశువులేమైనా పడి మేసేస్తే....?" తీవ్రంగా అన్నాడు.

"అలాగనకండి బాబూ! మీ తోటకి నాను హామీ! ఈ ఒక్కపాలికీ నన్నొగ్గేండి. రేపు తెల్లారేసరికి వచ్చేత్తాను ... ఎట్టాగయినా ..." బతిమిలాడాడు చెంచయ్య.

"లేదు, నువ్వెళ్లటానికి వీల్లేదు!" కరాఖండిగా చెప్పాడు విశ్వతేజ.

"పోనీ ఈ రోజ్జీతం తెగ్గోసుకోండి ... నా నెల్లాలి!" తప్పదన్నట్లు పలికాడు.

"నేను వద్దంటుంటే నీక్కాదూ! ముందు తోట పని చూడు!" హుకుం జారీచేశాడు.

చెంచయ్య మారు మాటలాడకుండా నిష్క్రమించాడు.

అది మొదలు వాడు అప్పుడప్పుడూ యజమానిని సెలవు కోరుతూ ఇంటికెళ్లటానికి ప్రయత్నించటం, కాదనటం పరిపాటైపోయింది.

కొంతకాలం ముందుకు జరిగింది.

ఈమధ్యకాలంలో చెంచయ్య సెలవడగలేదు. ఎందుకో వాడిమీద విశ్వతేజలో అనుమాన బీజం మొలకెత్తింది. చాలా రోజులై వాడు కళ్ల పడకపోవడంతో మరీ ముదిరింది.

ఒకరోజు రాత్రి తోటవైపు కారులో బయలుదేరాడు విశ్వతేజ. పొడుగు టార్చి వేసుకుని తోటలోకి వెళ్లాడు. చెంచయ్య జాడ లేదు. పెద్దగా పిలిచాడు. ఫలితం లేదు. ఒక నిముషానికి ఒక ఆకారం కదిలి ముందుకు వచ్చింది.

"ఆడీయేల ఈడేడుంటాడు బాబయ్యా? సొర్లోజుల కాణ్ణించి ఈ యేలకు ఎల్లిపోయి తెల్లారీయేలకి వత్తన్నాడు!" అని చెప్పాడు.

000

చెంచయ్యది అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం. రోడ్డుమీదున్న మొదటి పూరిపాక అతనిదే!

ఒకపక్కగా కారాపి విశ్వతేజ దిగాడు.

పాకవైపు టార్చి వేశాడు. చెంచయ్య కిర్రు చెప్పులు, మువ్వల కర్ర వాడి ఉనికికి సాక్ష్యమిచ్చాయి.

మెల్లగా చిన్న కిటికీ వద్దకు వెళ్లి చూశాడు విశ్వతేజ. లోపల దీపం బుడ్డి వెలుగులో, చెంచయ్య కదలికలు, చిన్నగా గాజుల చప్పుడు, సన్నని మూలుగులు వినిపిస్తున్నాయి.

విశ్వతేజకు కడుపు ఉడికిపోయింది.

రాత్రి పూట కూడా తోటకి కాపలా ఉండేలానే మొదట ఒప్పందం పడ్డాడు. చివరికి తనని మోసం చేసి ఈ విధంగా గడుపుతాడా వెధవన్నర వెధవ!

రేకు తలుపు చప్పుడు చేశాడు విశ్వతేజ.

చెంచయ్య హడావుడిగా తలుపు తీస్తూనే "ఎవుడెహే?" అన్నాడు విసుగ్గా.

"నేన్రా! ఏం, నీ మసక్కళ్లకి పోలిక దొరకలేదా?"

"తవరా, బాబూ? ఏటీ రాతిరేల వచ్చినారు...?" ఆశ్చర్యం ప్రస్ఫుటించింది వాడి గొంతులో.

"తమరి రాచకార్యాలు తిలకిద్దామని ..." రెట్టించిన గొంతుతో అన్నాడు విశ్వతేజ.


ప్రతి విషయంలో మీరు తీసికొనే నిర్ణయం సరైనదే.. అలాగే




సంతృప్తికరమైన దాంపత్య సుఖాన్ని మీ సొంతం చేసికోవచ్చు

ప్రపంచ ఆయుర్వేద చరిత్రలో ఎంతో విలువైనదిగా చెప్పబడిన కొరియాదేశపు జిన్‌సంగ్‌తో పాటు 690 మిల్లీ గ్రాముల వన మూలికలు మరియు భస్మములు వెంటనే ప్రభావం చూపగలిగేందుకై ఎక్స్‌ట్రాక్ట్స్ చేసి క్యాప్సూల్ రూపంలో ఇవ్వబడుచున్న ఫాంథర్ 69 మీకు సర్వవిధాల ఉపకరించి మీ సంసార సుఖానికి దోహదపడుతుంది. ఆయుర్వేదంలో దీనికి సాటి మరొకటి రాదనేందుకు ఎలాంటి సంశయం లేదు. మీకు ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని ఇవ్వగల జిన్‌సంగ్ కలిసిఉన్న ఫాంథర్ 69 క్యాప్సూల్ తీసుకోండి.

ప్రభావం కనిపించనట్లయితే మీ సమస్యతోపాటు ఫాంథర్ 69 క్యాప్సూల్ మీరు ఎలా వాడారో కూడా వివరంగా వ్రాయండి. మేము మీకు ప్రత్యేక కోర్స్‌కూడా తెలియపరుస్తాము.

పంపిణీదారులు
ఆర్డెంట్ ఇంటర్నేషనల్
జింఖానాక్లబ్‌రోడ్, జ్యోతి కాలేజి ఎదుట, గాంధీనగర్, విజయవాడ-3.

"ఏటి బాబూ మీ రనేదీ?" జంకుతూనే అన్నాడు చెంచయ్య.

"తిరిగి జవాబు కూడానా! నీలాంటి వాడిని నమ్ముకుంటే నా వ్యాపారం నిండా మునిగిపోయేది! ఛీ! ఈ కక్కుర్తి పనికోసమా నన్ను సెలవడిగింది ... అది నేను ఇవ్వనన్నాననే నన్ను మోసం చేసి మరీ ఇక్కడ తగలడ్డావు!" విశ్వతేజ అక్కసునంతా ప్రదర్శించాడు.

"ఏటి బాబూ! తెగ రెచ్చిపోతున్నారు? మీకు యాపారాలు, డబ్బు పోగేసుకోవటాలు ... దాన్లో మునిగిపోటాలు ముక్కెం ....! కానీ ప్రెతి మనిషికీ ఆకలి ఏసిన కడుపు కింతన్నం ఒడీకపోతే ఎట్టా మండిపోతాదో ... అట్టాటిదేనయ్యా ఇదీనూ ...! అది కక్కుర్తి కాదయ్యా! ముక్కెమైందయ్యా! కట్టుకున్న పెల్లాంను సుకపెట్టాల, మనం సుకపడాల! ఈ రెండూ నేకపోతే ఒకలమీద ఒకిలికి ఇలవుండదు బాబూ! నలుగురి కాడ సెయ్యి సాచి అడుక్కునీవోడు కూడా ఆడిక్కావలసిన కాడికి సంపాయిత్తాడు కానీ ఆ డబ్బు యావలో పడి సుకాలనొదులుకోటముంది సూసారూ! దానంత తెలివితక్కూ వని మరోట్నేదయ్యా! అందుకే నా సుకాలకి అడ్డుపడే మీవంటోరిచ్చే పని నా కొద్దయ్యా! నన్ను సుకమానంగా బతకనీండి బాబూ! ఈ నెల జీతం కూడా మీరే ఇడుకోండి బాబూ! నా కట్టంతో ఏడైనా బతగ్గల్ను! హాయిగా నా పెల్లాంతో సుకాలు పంచుకుంటూ ... మీ యాపారం నా మూలంగా పాడవటం నా కిట్టం నేదు బాబూ!" అని రేకు తలుపు పెద్ద చప్పుడయ్యేట్లుగా వేసేశాడు.

నిష్కర్ష నిండిన అటువంటి జవాబు చెంచయ్యనుండి వస్తుందని ఎదురు చూడని విశ్వతేజ అప్రతిభుడైనాడు. మెల్లగా నడిచి కారెక్కాడు.

"సుకాల నొదులుకోటముంది సూసారూ! దానంత తెలీతక్కూ వని మరోట్నేదయ్యా!" చెంచయ్య మాటలు సూటిగా మనస్సుని తాకి మెలిపెడుతున్నాయి.

ఇంటిదగ్గర కారాగింది.

ఎదురుగా చూశాడు. ఇంద్రభవనంలాంటి ఇల్లు. కారువంక చూశాడు. ఐరావతంలా ముద్దులొలికేలా ఉంది. నిజానికి తనకేం తక్కువ? ఇంత సంపాదనకి పరాకాష్ఠ సుఖపడటం.

ప్రతివాడూ కష్టించేది కడుపుకింత పడేసి, ఆనక సుఖపడటానికి. మరి సుఖపడనప్పుడు పడ్డ ఆ కష్టానికి అర్థం? ప్రతి మనిషిలాగే తనకూ కోరికలున్నాయి. కానీ తను వాటిని సమాధి చేసి కృత్రిమమైన ఎదుగుదల కోసం డబ్బు మత్తులో పడ్డాడు. తన దేహంలో ప్రతి అణువు నిండిన కోరికలకు సరైన న్యాయం జరగటంలేదు.

కానీ తనకంటే తక్కువవాడైన చెంచయ్య తన కోరికలకోసం డబ్బునే వదులుకోవటానికి సిద్ధపడ్డాడు. తన ఆనందాలకే ప్రాధాన్యతనిచ్చాడు. ఈ విషయంలో చెంచయ్య ముందు తనెంత?

విశ్వతేజలో ఏదో ప్రస్ఫుటమైన వివేకం తొలిసారిగా స్వాగతం పలికింది. బెడ్రూమ్‌లోకి నడిచాడు. నీలికాంతిలో అతని మనస్సు తమాషాగా రంజిల్లింది.

ఆ పాలపాన్పుపైన చందన ... అమాయకంగా దిండును కౌగలించుకుని పడుకుంది. అది చూశాక విశ్వతేజలో అనూహ్య పరిణామం ... ఆ దిండుస్థానంలో తను భర్తీ అయ్యాడు.

ఆ నిద్రలోనే ఆమె భర్తను బలంగా వాటేసుకుంది.

ఆహా...! ఏమిటీ మధురానందం ... నరాలు సుస్వరాలు పలికాయి. పెదవులలో అమృతపు సొనలు కురుస్తున్నాయి. స్వేదబిందువులు మౌక్తికాలను మరపించాయి.

అమరమైన ... అనంతమైన ... అద్భుతమైన ఆ రసమయ సన్నివేశం ... కుషన్ ఛైర్‌లో కూర్చుని వ్యాపార లావాదేవీల్లో మునిగిపోతే లభ్యం అవుతుందా? పెద్ద పెద్ద కాంట్రాక్టులు కొట్టేసి లక్షల్లో బాంక్ బాలెన్స్ పెంచుకుంటే ఉంటుందా? ఊహుఁ ...

ఇంతటి స్వర్గానుభూతి ఏవిధమైన సంపాదలోనూ కానరాదు. మనిషికి సుఖమే పెన్నిధి.

తనకంటే ఎన్నోవిధాల తక్కువవాడైనా చెంచయ్య ప్రబోధించిన వేదమే, తనలో పాతుకుపోయిన కాంక్షలను పునరుజ్జీవింపచేసింది.

వాడే తనకు ఎదురు తిరక్కుండా 'చిత్తం చిత్తం' అంటూ తన వెంట వచ్చి ఉంటే తనలో మునుపటి భావాలేవీ తొలగేవి కావు. వాడి మాటలు తన కోరికలకు కరదీపిక అయ్యాయి.

అందుకే విశ్వతేజకు ఆ రాత్రి, కొంగొత్త శృంగారవేదిక అయింది. తనలో ఈ భావాల సృష్టికర్త అయిన చెంచయ్యను తిరిగి పనిలో చేరమని కబురు పంపాడు.

కొంతకాలం తరువాత తన తోటలోనే ఓ పెంకుటిల్లు కట్టించి చెంచయ్యను పెళ్లాంతో ఉండమన్నాడు విశ్వతేజ. ■

## పని చేస్తూ ఆనందంగా వుండండి!



పనిరాక్షసులుగా వుండటంలో ఏ మాత్రం చెడు లేదట. నిజానికి ఏదో సాధించాలని తపించేవారూ, రీసెర్చ్ స్కాలర్లూ తక్కినవారు అంటే పదింటికి వచ్చి ఐదింటికి వెళ్లిపోయేవారి కన్నా ఎక్కువ ఆనందంగా, ఆరోగ్యంగా వుంటారట. ఇలాంటివారు సెలవుల్లో బయటికి వెళ్లినా ఆఫీసూ, గట్రా పూర్తిగా మరిచిపోయి పూర్తి ఆనందాన్ని పొందగలరు. పనివేళల తరువాత కూడా వుండి పనిచేయటం వారికి ఆ పని పట్ల వున్న ఆసక్తి మాత్రమే కాని, ఇతరులతో పోటీ ఏమాత్రం కాదని కూడా అంటున్నారు. ఇలాంటివారు ఆఫీసుతో పాటు గృహవ్యవహారాలను కూడా, దేనికీ అధికప్రాముఖ్యాన్నివ్వకుండా బ్యాలెన్సుతో చేయగలరట. మరి దీన్ని కాస్తయినా అలవాటు చేసుకుంటే మేలు కాదా?

ఎన్.